క్లుప్తంగా

న్యామద్దెలలో సత్యసాయి నగర సంకీర్తన



న్యామద్దెలలో భగవాన్ సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని న్యామద్దెలలో శనివారం సత్యసాయి నగర సంకీర్తన చేశారు. సత్యసాయి బాబా జయంతిని పురస్కరించుకుని సత్యసాయి చిత్ర పటాన్ని పల్లకీలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రధాన వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామి వారి సంకీర్తనలు ఆలపిస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణమూర్తి, పెద్దన్న, పద్మావతితో పాటు భారీగా సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి



తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

ఎన్‌పీకుంట: మండలంలోని పలు పంచాయతీలలో సోలార్ పవర్‌ప్లాంట్ల నిర్మాణాల కోసం బలవంతపు భూసేకరణ ఆపాలని ఏపీ రైతు సంఘం, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వారు తహసీల్దార్ దేవేంద్ర నాయక్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌పీకుంట, పీ కొత్తపల్లి పంచాయతీలలో గతంలో వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్‌ప్లాంట్ నిర్మాణ సమయంలో ఎన్నో హామీలు చెప్పి భూసేకరణ చేశారని గుర్తు చేశారు. భూనిర్వాసితులకు ఇంటికో ఉద్యోగం, స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి నట్టేట ముంచారన్నారు. భూసేకరణ సమయంలో గ్రామసభలు ఏర్పాటు చేసి..ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో సంతకాలు చేపట్టి సోలార్ ప్రాజెక్టులకు భూములు అప్పజెప్పితే పోరాటాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు రమణయ్య, రాజారెడ్డి, గంగిరెడ్డి, సీఐటీయు నాయకుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గాలీవాన బీభత్సం.. అరటి రైతుకు నష్టం



నేలకొరిగిన అరటి తోటను చూపుతున్న రైతు చెన్నారెడ్డి

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని చిగిచెర్ల గ్రామంలో శుక్రవారం రాత్రి గాలీ వాన బీభత్సం సృష్టించింది. చెన్నారెడ్డి అనే రైతు అరటి తోట నేలకొరిగింది. తీవ్రంగా నష్టపోయినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు ఎకరాలలో మూడు వేలకు పైగా అరటి చెట్లు సాగు చేశానని, ఇప్పటి వరకు రూ.5 లక్షల దాకా పెట్టుబడి పెట్టానని చెప్పారు. గాలీవానకు సుమారు 150 చెట్లు నేలకొరిగి.. మూడు టన్నుల దాకా పంట నష్టపోయినట్లు తెలిపారు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని తోటి రైతులు కోరారు.

తూపల్లిలో పిడుగుపాటు

తలుపుల : మండలంలోని తూపల్లి గ్రామానికి చెందిన చిన్నపరెడ్డి ఇంటిపై శుక్రవారం రాత్రి పిడుగుపడింది. ఆ సమయంలో ఇంటిపైన ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. పిడుగు పడినప్పుడు ఇంటిపైన గోడ పాక్షికంగా దెబ్బతినింది. ఇంటికి ఎర్త్ అయి వైరింగ్, స్విచ్ బోర్డులు కాలిపోయాయి. గ్రామంలో గతంలో ఎన్నడూ ఇళ్లపై పిడుగు పడలేదని, ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పిడుగు పడడంతో భయభ్రాంతులకు గురైనట్లు స్థానికులు తెలిపారు.

నాగేంద్రమ్మకు సన్మానం



నాగేంద్రమ్మను సత్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తదితరులు

బత్తలపల్లి: ప్రకృతి వ్యవసాయం సాగులో ఆదర్శంగా నిలిచిన నెట్టెం నాగేంద్రమ్మను జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో నాగేంద్రమ్మకు జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, వ్యవసాయ శాఖ జేడీ, వెటర్నరీ జేడీ, ఇతర అధికారులు బహుమతి ప్రదానం చేశారు. విష పదార్థాలు లేకుండా పంటలు సాగు చేయడం అభినందనీయమని జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు కొనియాడారు.

అడుగుకో గుంత.. పట్టించుకోని పల్లె



లోచర్ల సచివాలయం వద్ద ఏర్పడిన భారీ గుంత

- పడుతూ లేస్తూ ప్రయాణం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



సాయినగర్ వద్ద ఏర్పడిన గుంత



బైరాపురం వద్ద గుంతలో నిలిచిన వర్షపు నీరు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో గ్రామీణ రహదారులు ఛిద్రమయ్యాయి. అడుగుకో గుంత అన్నట్లు పరిస్థితి ఉందని ప్రజలు వాపోతున్నారు. రోడ్ల గుంతల్లో వర్షపు నీళ్లు నిలిచి ఉండడంతో వాహనదారులు అంచనా వేయలేక..అందులోకి వాహనాలు దింపి పడుతూ.. లేస్తూ ప్రయాణిస్తున్నారు. ఒక్కో గుంత మోకాలి లోతు ఉండడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి సైతం ఇవే రోడ్లలో ప్రయాణిస్తున్నా ఏమాత్రమూ పట్టించుకోలేదని, ఆయా గ్రామాల్లో ఓట్లు వేయించుకున్న అధికార పార్టీ నాయకులు సైతం పట్టీపట్టనట్లు ఉన్నారని ప్రజలు వాపోతున్నారు.

- కొత్తచెరువు నుంచి పెనుకొండకు వెళ్లే ప్రధాన రహదారిలో పది కిలోమీటర్ల దూరానికి వంద గుంతలు ఉన్నాయి. ముఖ్యంగా కొత్తచెరువు నెహ్రూ సర్కిల్, లోచర్ల, బైరాపురం, ఓబుళదేవరపల్లి, సాయినగర్, అప్పలవాండ్లపల్లి వద్ద భారీ గుంతలు ఏర్పడ్డాయి.
- పుట్టపర్తిలోని ఎనుములపల్లి సర్కిల్, వెస్ట్ గేట్, వెంగళమ్మచెరువు, గంగిరెడ్డిపల్లి, నిడిమామిడి, ఓడీచెరువు మండల కేంద్రంలోని ప్రధాన రహదారి, నల్లమాడ మండల కేంద్రంతో పాటు వైఎస్సార్ సర్కిల్, బుక్కపట్నంలోని బైపాస్ రోడ్డు, అమడగూరు మండల కేంద్రంతో పాటు గ్రామాల రోడ్లు గుంతలమయమయ్యాయి.
- రోడ్ల గుంతల్లో రెండు రోజుల నుంచి సుమారు పది మంది వాహనదారులు కింద పడ్డారు. అందులో నలుగురు మహిళలు కూడా ఉన్నారు. ఇంకా వెలుగులోకి రాని ఇలాంటి ఘటనలు ఎన్నో ఉన్నాయి.
- రోడ్ల దుస్థితిపై ప్రజలు ఇప్పటికే సోషల్ మీడియాలో భారీఎత్తున పోస్టులు పెడుతున్నారు. అయినా ప్రజాప్రతినిధులు, అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి రోడ్ల అభివృద్ధికి కృషి చేయాలని కోరుతున్నారు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



బైరాపురం నుంచి కొత్తచెరువు మండల కేంద్రానికి వెళ్లాలంటేనే భయమేస్తోంది. పది కిలోమీటర్ల దూరానికి వంద గుంతలు ఉన్నాయి. గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీళ్లు నిలిచాయి. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రెండు రోజుల క్రితం పెనుకొండ నుంచి కొత్తచెరువుకు వెళ్తున్న ఓ ద్విచక్ర వాహనం నుంచి మహిళ జారి పడి గాయపడింది. ఆమెను మేమే ఆసుపత్రికి చేర్చాము. రోడ్ల దుస్థితిపై ఇప్పటికే ఆర్‌అండ్‌బీ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు.

– జనార్దన్, బైరాపురం

రూ.2 వేలు ఖర్చు చేసి జేసీబీతో నీళ్లు తొలగించాము



ప్రస్తుత వర్షాలకు మా గ్రామం వద్ద ఉన్న భారీ గుంతల్లో నిలిచిన నీళ్లను జేసీబీ సహాయంతో తొలగించాము. ఇందుకు రూ.2 వేలు ఖర్చు చేశాం. రోడ్ల గురించి అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నా జీవితంలో ఎన్నడూ ఇంతలా రోడ్లపైన గుంతలు చూడలేదు. ప్రభుత్వం వెంటనే గుంతలు పూడ్చి.. సమస్య పరిష్కరించాలి. లేదంటే ఎంత మంది ఆసుపత్రుల పాలవుతారో చెప్పలేం.

– శంకర్‌రెడ్డి, లోచర్ల

ప్రభుత్వ వైద్యకళాశాలల పరిరక్షణే ధ్యేయం

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త మక్బూల్

కదిరి టౌన్: ప్రభుత్వ వైద్య కళాశాలల పరిరక్షణే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ అన్నారు. వైద్య కళాశాలల పరిరక్షణ కోసం 'కోటి సంతకాల ప్రజా ఉద్యమం' పోస్టర్లను శనివారం కదిరి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. కోటి సంతకాల ప్రజా ఉద్యమాన్ని అన్ని మండలాల్లో చేపడుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో మొట్టమొదట సంతకాల సేకరణ పూర్తి చేసి..తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి చేర్చుతామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టారన్నారు. వాటిని ప్రైవేటుపరం చేయడానికి చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించడం తగదన్నారు. దీనివల్ల పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు షేక్ బాబ్జాన్, మండల కన్వీనర్లు రవికుమార్‌రెడ్డి, ఫయాజ్, అశోక్‌వర్ధన్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, రంగారెడ్డి, మణికంఠ నాయక్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



కొండపల్లిలో సీతారాములను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: మండలంలోని కొండపల్లి గ్రామంలో శనివారం సీతారాముల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శుక్రవారం సాయంత్రం నుంచి వేదపండితులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. శనివారం తెల్లవారుజామునే ఆలయంలో సీతా సమేత రామస్వామి, లక్ష్మణ, ఆంజనేయస్వామి, గణపతి విగ్రహాలను ప్రతిష్టించారు. ఆలయం ముందు సుబ్రహ్మణేశ్వరస్వామి నవగ్రహ విగ్రహాలు, ధ్వజస్తంభంపై కలశం ప్రతిష్టించారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పూజల్లో పాల్గొన్న తోపుదుర్తి

కొండపల్లి గ్రామంలో జరిగిన సీతారాముల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకురాలు గంగుల భానుమతి, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్‌తో కార్యకర్తలకు భరోసా



డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నల్లచెరువు: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై జరుగుతున్న దాడులకు చెక్ పెట్టి.. భరోసా కల్పించేందుకే డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ప్రవేశ పెట్టినట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కూటమి నాయకుల దౌర్జన్యాలు, దాడులకు గురైన వారు వివరాలను డిజిటల్ బుక్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మండల వైస్ కన్వీనర్ రఫీ, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, మాజీ టెంపుల్ చైర్మన్ ఆనంద్‌రెడ్డి, సర్పంచ్ యూసుఫ్, ఎంపీటీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, ఎస్టీసెల్ నియోజక వర్గ కన్వీనర్ రమణ నాయక్, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ నాగభూషణ, వైఎస్సార్‌టీయూ మండల కన్వీనర్ ఖాదర్‌వలి, డైరెక్టర్ ఆదిమూర్తి, మైనార్టీ నాయకులు నజీర్, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీపతి, సలీం, ఎం.కృష్ణారెడ్డి, శ్రీకంఠరెడ్డి, నల్లచెరువు గ్రామ కన్వీనర్ సూర్యశేఖర్‌రెడ్డి, యూత్ కన్వీనర్ మన్సూర్ భాష, బీసీ మండల కన్వీనర్ హరి తదితరులు పాల్గొన్నారు.

బాలురతో సమానంగా బాలికలను ప్రోత్సహించాలి

బత్తలపల్లి: బాలురతో పాటు బాలికలకు సమానంగా ప్రోత్సహించాలని సర్వశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ దేవరాజు సూచించారు. శనివారం మండలంలోని సంజీవపురం వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రిన్సిపాల్ గుల్జార్ బేగం అధ్యక్షతన అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. బాల్య వివాహ చట్టం, లైంగిక వేధింపుల చట్టం, సైబర్ క్రైమ్, మాదక ద్రవ్యాల చట్టాలపై అవగాహన కల్పించారు. పోషణ్‌మాలో భాగంగా పోషకాహార విలువలను తెలుపుతూ అంగన్‌వాడీ కార్యకర్తల సహకారంతో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. బాలల సంరక్షణ విభాగం సిబ్బంది నాగలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ ఎర్రమ్మ, దేవమణి, ఎస్‌ఐ సోమశేఖర్, ఏఎన్‌ఎం లక్ష్మీకాంత, ఐసీడీఎస్ సిబ్బంది, కేజీబీవీ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలోని ఆర్డీటీ చిల్డ్రన్స్ హోంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. విన్సెంట్ ఫాదర్ ఫెర్రర్ చిత్రపటానికి ఆర్డీటి రీజనల్ డైరెక్టర్ హనుమంతప్ప పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సెంటర్ కో–ఆర్డినేటర్ రామకృష్ణ, ఉపాధ్యాయులు పుష్పలత, సరోజ, ఎల్లప్ప, గిరిరాజు, యల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు: స్థానిక కేజీబీవీలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ ఆధ్వర్యంలో పోటీల్లో గెలుపొందిన బాలికలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌ఓ అబీదా, వైద్య, ఆరోగ్య శాఖ ప్రతినిధి వెంకటరమణ పాల్గొన్నారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా



ఇసుక తరలిస్తూ పట్టుబడిన ట్రాక్టర్లు

బత్తలపల్లి: మండలంలోని చిత్రావతి నది పరివాహక ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు మండలంలోని జ్వాలాపురం క్రాస్ వద్ద జాతీయ రహదారిపై ఆర్డీఓ ఇసుక చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. ఇక్కడ పోలీసులు, మైనింగ్, రెవెన్యూ అధికారులు బందోబస్తు ఉండి ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే ఇక్కడ విధులు నిర్వహించే సిబ్బంది స్థానిక టీడీపీ నాయకుల ప్రలోభాలు, బెదిరింపులు, ఇతరత్రా వాటికి తలొగ్గారు. వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. రాత్రి 8 గంటల నుంచి తెల్లవారుజామున 6 గంటల వరకు టిప్పర్లు, ట్రాక్టర్లు జాతీయ రహదారిపై ఇసుక తరలిస్తున్నా పోలీసులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. టీడీపీ నేతల నుంచి ముడుపులు తీసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గురువారం రాత్రి ఆర్డీఓ మహేష్ ఆకస్మికంగా దాడులు చేసి ఒక టిప్పర్, రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శనివారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో ఆర్డీఓ రెండు ట్రాక్టర్లను జ్వాలాపురం క్రాస్ వద్ద పట్టుకున్నారు. ఇలా ఆర్డీఓ వచ్చినప్పుడు మాత్రం ఎస్‌ఐ సోమశేఖర్, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ట్రాక్టర్లను పట్టుకుంటున్నారు.

ఘనంగా పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలు



కదిరి పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న సమన్వయకర్త మక్బూల్ అహ్మద్



తనకల్లు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు బ్రెడ్లు అందజేస్తున్న నాయకులు

కదిరి టౌన్/అర్బన్/తనకల్లు: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు శనివారం కదిరి పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. సీనియర్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు షేక్ బాబ్జాన్, కౌన్సిలర్ రామ్ ప్రసాద్, రూపా హోటల్ శివారెడ్డి, యూత్ విభాగం అధ్యక్షుడు రమేష్‌యాదవ్, దామోదర్‌రెడ్డి, చెన్నూర్ గంగాధర్, బాబా, రెడ్డప్ప , ఫయాజ్, శీనానాయక్, మన్సూర్, రామచంద్ర, రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక హిందూపురం రోడ్డులోని మాధవ గురుకులంలో పార్టీ ఎస్‌ఈసీ సభ్యుడు డాక్టర్ బత్తల హరిప్రసాద్ సోదరుడు రాంప్రసాద్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. హైదరాబాదులోని పెద్దిరెడ్డి నివాసంలో జరిగిన వేడుకల్లో బత్తల హరిప్రసాద్ పాల్గొని.. జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

- తనకల్లులో పెద్దిరెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేశారు. స్థానిక 30 పడకల ప్రభుత్వాసుపత్రిలో రోగులు, వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి, ఎంపీటీసీలు హిమధర్‌రెడ్డి, రమణ, సర్పంచ్ నాగరాజు, వార్డు సభ్యుడు బాబ్‌జాన్, నాయకులు సంజీవరెడ్డి, నాగభూషణరెడ్డి, బీఎస్ కలాం, మాధవ్‌రెడ్డి, మండల కమిటీ సభ్యులు నరేంద్ర, సూరి, లక్ష్మీరెడ్డి, పూల శంకర్, నరసింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కదిరి ప్రభుత్వాస్పత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



కదిరి మాధవ గురుకులం విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ బత్తల రాంప్రసాద్

ఘనంగా వాల్మీకి జయంత్యుత్సవం



వాల్మీకి విగ్రహం వద్దకు జ్యోతుల తీసుకుని ఊరేగింపుగా వస్తున్న మహిళలు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రమైన చెన్నేకొత్తపల్లిలో శనివారం మహర్షి వాల్మీకి జయంత్యుత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. జాతీయ రహదారి సమీపంలో ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహాన్ని పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మహిళలు జ్యోతులు తీసుకుని మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చి సమర్పించారు. వాల్మీకి విగ్రహాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వాల్మీకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గోరకాటికి సన్మానం



పురుషోత్తంరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ధర్మవరం అర్బన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన గోరకాటి పురుషోత్తం రెడ్డిని శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సహకారంతో పట్టణానికి చెందిన గోరకాటి పురుషోత్తంరెడ్డికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పదవి కట్టబెట్టారు. కార్యక్రమంలో గాంధీనగర్ 18వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గుండా ఈశ్వరయ్య, నాయకులు నారాయణ స్వామి, పల్లా రామాంజి, దాసరి రాము, మహేష్, షాకీర్, నరేష్, నూర్ మహమ్మద్, శీనా పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ బలోపేతమే లక్ష్యం

నల్లమాడ: గ్రామ స్థాయి నుంచి ఆర్ఎస్ఎస్ బలోపేతమే లక్ష్యంగా సభ్యులు కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ ఏర్పడి వందేళ్ల అయిన సందర్భంగా శనివారం మండలంలోని రెడ్డిపల్లిలో సమావేశం నిర్వహించారు. నాయకులు మురళీమోహన్, రమేష్, విశ్వ హిందూపరిషత్, భజరంగదళ్‌కు చెందిన పలువురు ప్రతినిధులు, భజన బృందాల సభ్యులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు



పంటలు నమోదు చేస్తున్న దృశ్యం

ఓడీచెరువు : ఖరీఫ్ సీజన్లో రైతులు సాగుచేసిన పంటలను రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు శనివారం ఈ- క్రాప్‌లో నమోదు చేశారు. ఓడీచెరువు పంచాయతీ పరిధిలో ఇప్పటికే గుర్తించిన సర్వే నంబర్లలో సాగైన వేరుశనగ, కంది, ఉలవ, ఇతర వాణిజ్య పంటలకు ఈ-క్రాప్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాసుల రెడ్డి, వీఆర్‌ఓ శ్రీలత, హార్టికల్చర్ అధికారి హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఏర్పాటు చేయండి

తలుపుల : మండలంలోని వేపమానిపేట పంచాయతీలో గల గంజివారిపల్లి, బోయపల్లి, ఎస్సీ కాలనీలు, కొత్తపూలవాండ్లపల్లి, గుర్రంగుండ్లపల్లి గ్రామాలను కలిపి గంజివారిపల్లి కేంద్రంగా పంచాయతీ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రతి అవసరానికి వేపమానిపేట గ్రామానికి వెళ్లాలంటే 28 కిలోమీటర్లు ప్రయాణించాలని, వృద్ధులు, దివ్యాంగులు, పేదలు చాలా ఇబ్బంది పడుతున్నారని, కావున నూతన పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు ఆవుల మధుసూదన్‌రెడ్డి, నాగభూషణ, అక్బర్, నరేష్, ముస్తఫా, బాబా తదితరులు తెలిపారు.

తపాలా సేవలను వినియోగించుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న తపాలా శాఖ ఉద్యోగులు

ధర్మవరం అర్బన్: తపాలా శాఖ అందిస్తున్న వివిధ రకాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రధాన పోస్టుమాస్టర్ భానుకుమార్ తెలిపారు. పట్టణంలోని తపాలాశాఖ కార్యాలయంలో శనివారం తపాలా వారోత్సవాలను నిర్వహించారు. పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పోస్టుమాస్టర్ మాట్లాడుతూ తపాలా వారోత్సవాలు ఈ నెల 14 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. తపాలా సేవల్లో భాగంగా ఆధార్ సేవలు సైతం అందిస్తున్నామన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం

తాడిమర్రి: వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు సోకవని హెల్త్ సూపర్‌వైజర్ రామ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో శనివారం వైద్య సిబ్బందితో కలసి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజూ ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా స్నానం చేయాలన్నారు. అలాగే ఉతికిన బట్టలు ధరించాలన్నారు. మరుగుదొడ్డికి వెళ్లి వచ్చిన తర్వాత సబ్బుతో చేతులు, కాళ్లను శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. దగ్గు, జలుబు వస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి వైద్య చికిత్స చేయించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్ రెడ్డి, జానకీరాం, వార్డెన్ విష్ణువర్ధన్ రెడ్డి, ఆశా కార్యకర్తలు నరసమ్మ, ధనమ్మ పాల్గొన్నారు.

ముదిగుబ్బ: వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని వైద్య సిబ్బంది విద్యార్థినులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని బాలికల వసతి గృహాన్ని వైద్య సిబ్బంది సందర్శించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులు, వ్యక్తి గత పరిశుభ్రత, మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు.

రికార్డుల తనిఖీ

ఎన్‌పీకుంట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం కదిరి ఆర్డీఓ వీవీఎస్ శర్మ రికార్డులు తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని సూచించారు. మండలంలో చేపట్టిన రీసర్వేపై గ్రామ రెవెన్యూ అధికారులతో చర్చించారు. రీసర్వేపై పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్, తహసీల్దార్ దేవేంద్రనాయక్ ఉన్నారు.